

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం

రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ కరుణసాగర్‌రెడ్డి



కరుణసాగర్‌రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వాహనదారులు రోడ్డు నిబంధనల మేరకు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయి. జిల్లాలో ప్రతి ఒక్క వాహనదారునికి, డ్రైవర్లకు లైసెన్సులు మంజూరు చేసి రోడ్డు ప్రమాదాల జరగకుండా నివారణ చర్యలు చేపడతామని హిందూపురం రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి కరుణ సాగర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తితో ఆదివారం మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేయకపోవడానికి కారణం ఏమిటి?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని గతంలో పుట్టపర్తిలో ఏర్పాటు చేశాం. కానీ కొన్ని అనివార్య కారణాల వలన హిందూపురంలోనే కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం వాహన లైసెన్సులు పొందవలసిన వారు హిందూపురం నుండి పొందుతున్నారు. వాహనదారులు ఎక్కువగా ఉన్న కారణంగా హిందూపురం నుండే కొనసాగిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుట్టపర్తిలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం.

ప్ర: శ్రీ సత్యసాయి జిల్లాలో ఎన్ని వాహనాలు ఉన్నాయి, కాలం చెల్లిన వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లాలో ఆటో రిక్షాలు, గూడ్స్ వాహనాల పాటు ఇతర వాహనాలు మొత్తం 2,77,235 వాహనాలు ఉన్నాయి. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేయలేకపోవటంతో హిందూపురం నుండి కార్యకలాపాలు సాగిస్తున్నాం. వాహన లైసెన్సులు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్లు తదితర ఆన్లైన్ కార్యకలాపాలు ప్రస్తుతం హిందూపురం నుండి కొనసాగిస్తున్నాం. ఇక్కడినుండే అన్ని చెల్లింపులు జరుగుతున్నాయి.



ప్ర : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరక్కుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రజలకు, వాహన యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. 18 సంవత్సరాల లోపు వారు వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటున్నాం. లైసెన్సు లేనివారు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, భారీ వాహనాలు నడపకుండా చర్యలు చేపడుతున్నాం. అలాంటి వారిని ట్రాన్స్‌పోర్టు అధికారులు గుర్తించి వారికి అవగాహన కల్పించి లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. లైసెన్సు మంజూరు చేయడానికి మేళాలు ఏర్పాటు చేసి వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి లైసెన్సులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : బడిబస్సుల కండీషన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : పాత బస్సులను, కాలం చెల్లిన బస్సులను నడిపే పాఠశాలలపై చర్యలు తీసుకుంటున్నాం. అలాంటి బస్సులను లైసెన్స్, పరిమితులు పునరుద్ధరణకు వచ్చినప్పుడు వాటినిపరిశీలించి కండిషన్ సరిగా లేని వాటిని తిరిగి పంపుతున్నాం. వాటి పనితీరును పరిశీలించి పర్మిట్లు మంజూరు చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఏ పాఠశాల వారైనా బస్సులు నడిపితే వారిపై కేసులు పెడతాం. అలాంటి బస్సులను సీజ్ చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రీ సత్య సాయి జిల్లాలో కాలం చెల్లిన బడి బస్సులకు అనుమతులు మంజూరు చేయం.



పక్కాగా ఏ 'మార్చేశారు'..!


- లేపాక్షి హబ్ పేరుపై అన్‌సెటిల్డ్ భూములు
- వారం రోజుల క్రితం వరకూ అన్‌సెటిల్డ్ కిందనే ఆన్‌లైన్‌లో..
- రెండు రోజుల్లో 'లేపాక్షి'పై మారిన 1075 ఎకరాలు
- లబోదిబోమంటున్న రైతులు
- పొంతనలేని సమాధానం ఇస్తున్న అధికారులు
- సాంకేతిక లోపమా..? బోగస్ కంపెనీలకు సాయమా..?



లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో రైతులకు జరిగిన అన్యాయం అంతా, ఇంతా కాదు. పరిశ్రమ ఏర్పాటు పేరుతో వేలాది ఎకరాలను రైతుల నుంచి బలవంతంగా లాగేసుకున్నారు. తీరా అక్కడ కంపెనీ ఏర్పాటు చేయకుండా రైతుల భూములను బడాపారిశ్రామిక వేత్తలు బ్యాంకుల్లో తాకట్టుపెట్టి కోట్లాది రూపాయలు కాజేశారు. అక్కడితో ఈ అవినీతిబాగోతం ఆగేలా కన్పించడం లేదు. లేపాక్షిహబ్ పేరుతో ఇప్పటికీ పొలాలు లాగేసుకునే కుట్ర జరుగున్నట్లుగానే తెలుస్తోంది. తాజాగా చిలమత్తూరు మండల పరిధిలోని పలు అన్‌సెటిల్డ్ భూములు లేపాక్షి హబ్ పేరుపై ఆన్‌లైన్‌లో మారాయి. వారం రోజుల క్రితం వరకు ఆన్‌లైన్‌లో అన్‌సెటిల్డ్ భూములుగా ఆన్‌లైన్ ఉన్నవి ఇప్పుడు లేపాక్షి హబ్‌పై చూపిస్తున్నాయి. వీటిని చూసిన రైతులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చిలమత్తూరు మండలంలో లేపాక్షి హబ్ పేరుతో రైతుల భూములను తీసుకున్నారు. అతరువాత అక్కడ పరిశ్రమ ఏర్పాటు కాలేదు. పరిశ్రమలు ఏర్పాటు చేయని నేపథ్యంలో ఆ భూములను రైతులకు వెనక్కు ఇచ్చేయాలని పెద్ద ఎత్తున సిపిఎం, ఇతర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసనలూ జరిగాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం అన్‌సెటిల్డ్ (వివాదాస్పద) భూములపై పెద్దల కన్ను పడినట్లు తెలుస్తోంది. చిలమత్తూరు మండల పరిధిలో అన్‌సెటిల్డ్ పేరుపై ఆన్‌లైన్‌లో ఉన్న 1075 ఎకరాల భూమి రెండు రోజుల క్రితం లేపాక్షి హబ్‌పై పేరు మార్పిడి జరిగింది. రీసర్వే పేరిట అపరిష్కృత భూములకు పరిష్కారం చూపాల్సిన తరుణంలో ఉన్న భూములను ఇలా కార్పొరేట్ సంస్థ పేరిట మార్పిడి జరగడం వెనుక ఎవరి హస్తం ఉందన్నది



Adangal — వారం క్రితం

సర్వే నెం : 452-7	పూర్తి విస్తీర్ణం : 5.0
సాగుకు పనికి రాని విస్తీర్ణం : 0.0	
సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం : 5.0	
భూమి స్వభావం : డిపట్టా	
శిస్తు (రూ.) : 0.25	భూమి వివరణ : మెట్ట
జల ధారము : వర్షం	ఆయకట్టు విస్తీర్ణం : 0.0
ఖాతా నెంబరు : 123456	
అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) : 5.0	
పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) : UNSETTLED PROPERTY (UNSETTLED PROPERTY)	

Adangal — ఇప్పుడు

సర్వే నెం : 452-7	పూర్తి విస్తీర్ణం : 5.0
సాగుకు పనికి రాని విస్తీర్ణం : 0.0	
సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం : 5.0	
భూమి స్వభావం : డిపట్టా	
శిస్తు (రూ.) : 0.25	భూమి వివరణ : మెట్ట
జల ధారము : వర్షం	ఆయకట్టు విస్తీర్ణం : 0.0
ఖాతా నెంబరు : 123456	
అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) : 5.0	
పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) : లేపాక్షి నాలెడ్జ్ హబ్ (లేపాక్షి నాలెడ్జ్ హబ్)	

తెలియడం లేదు. అన్నదమ్ముల వివాదాల నేపథ్యంలో కోర్టుల్లో ఉన్న భూములు, పట్టాపాసుపుస్తకం కలిగి పెద్ద అడంగల్, ఆన్‌లైన్ 1బి చేసుకోని భూములు అన్‌సెటిల్డ్‌గా ఆన్‌లైన్‌లో ఉంటాయి. ఈ భూములన్నీ ఖాతా నెంబర్ "123456" గా అపరిష్కృత భూముల జాబితాలో ఉంటాయి. 1-బిలోనూ వీటి వివరాలు అన్‌సెటిల్డ్ అనే చూపిస్తుంటాయి. ఇలాంటి భూమి చిలమత్తూరు రెవెన్యూ పొలంలో సుమారు 1388 సర్వేనెంబర్లలో 1200 ఎకరాలకుపైనే ఉంది. ప్రస్తుతం ఇలాంటి భూముల్లో దాదాపు 1075 ఎకరాలు 1-బిలో లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుపై చూపిస్తోంది. ఇది చూసిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అన్‌సెటిల్డ్ కింద ఉన్న భూముల రికార్డులు ఎలా మారాయంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

సాంకేతిక లోపమో..? బోగస్ కంపెనీలకు సాయమో..?

అన్‌సెటిల్డ్ కింద ఉన్న భూములు ఒక్కసారిగా లేపాక్షి హబ్ పేరుతో ఆన్‌లైన్‌లో రావడంపై సర్వత్రా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెవెన్యూ అధికారులకు తెలియకుండా, వారి ప్రమేయం లేకుండా 1-బి జాబితాలో పేర్లు మారే అవకాశం లేదు. అలాంటిది ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా వెయ్యి ఎకరాల భూమి ఓ కార్పొరేట్ కంపెనీ పేరుపై రావడం వెనుక పెద్దల హస్తం ఉంటుందనే అనుమానాలు బలంగా ఉన్నాయి. రెవెన్యూ అధికారులు మాత్రం దీనిపై పొంతలేని సమాధానం ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లో సమస్య వల్లనే అలా చూపిస్తున్నాయని, దానిని సరి చేస్తామని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. సాంకేతిక సమస్య ఉంటే అన్‌సెటిల్డ్ పేరుపై ఉన్న భూములు లేపాక్షి హబ్‌కే ఎలా మారుతాయంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రైతులు రెవెన్యూ ముఖ్య అధికారిని అడిగితే ఇంతకాలంగా వివాదాస్పద భూముల సమస్యను మీరెందుకు పరిష్కరించుకోలేదంటూ ఎదురు ప్రశ్న వేయడం గమనార్హం. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులే ఇలా రైతులకు ఎదురు ప్రశ్నలు వేయడం విస్మయానికి గురి చేస్తోంది. అన్‌సెటిల్డ్ భూములు ఆన్‌లైన్‌లో పేరు మార్పు సాంకేతిక లోపమో..? లేక బోగస్ కంపెనీలకు సాయమో..? తెలియని పరిస్థితి నెలకొంది.

లేపాక్షి హబ్‌పేరుపై చూపిస్తోంది



నాకు సర్వేనెంబర్ 407-14లో 1.18 ఎకరాల భూమి ఉంది. ఇందులో సుమారు 0.78 ఎకరాలు అన్నాదమ్ముల సమస్య కారణంగా ఇంతకాలంగా కోర్టు లో వివాదం నడుస్తోంది. దీంతో భూమికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ అన్‌సెటిల్డ్ జాబితాలో ఉండేది. ఇప్పుడు చూస్తే 1-బిలో లేపాక్షి హబ్ అని వస్తుంది. రెండు రోజుల క్రితం అన్‌సెటిల్డ్‌లో ఉన్న మా భూమి మాకు తెలియకుండా లేపాక్షి హబ్ పేరుకు ఎలా మారిందో అర్థం కాని పరిస్థితి ఉంది.

రామకృష్ణ రెడ్డి, రైతు.

రెండు రోజులక్రితం వరకూ అన్‌సెటిల్డ్‌లోనే ఉంది...



నా భూమికి సంబంధించి పాస్ పుస్తకం ఇవ్వమని గత రెండేళ్లుగా నేను అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. ఆన్‌లైన్‌లో అన్‌సెటిల్డ్‌గా చూపుతోందని, దీంతో పాసుస్తకం ఇవ్వలేమని రెవెన్యూ అధికారులు చెబుతూ వచ్చారు. ఇటీవల మ్యూటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాను. ఇంతలోనే లేపాక్షి హబ్ పేరిట భూమి వివరాలు వస్తున్నాయి. విఆర్వోను అడిగితే ఆ భూములు లేపాక్షి హబ్ పరిధిలోకి వస్తాయంటున్నారు. వారం రోజుల క్రితం వరకు కూడా మా భూమి ఆన్‌లైన్‌లో అన్‌సెటిల్డ్ కిందనే ఉంది.

సురేష్, రైతు.

ఊరిలో సగభాగం మార్చేశారు...



నేను నా పట్టా భూమిలో నిర్మించుకున్న ఇళ్లతో పాటు మా ఊరిలో సగం ఇళ్లు లేపాక్షి హబ్ పేరిట మార్చేశారు. మా సర్వే నెంబర్ 407-1, 407-2, 409-1,409-2 మొత్తం 2 ఎకరాల పట్టా భూమి ఉంది. ప్రస్తుతం దీని వివరాలు అన్నీ ఆన్‌లైన్‌లో లేపాక్షి హబ్ పేరిట మార్చేశారు. ఇదేమని రెవెన్యూ అధికారులను అడిగితే వారు పొంతలేని సమాధానం ఇస్తున్నారు. ఉన్న ఫలంగా ఇలా రికార్డులు ఎలా మారాయన్న దానిపై అధికారులు సమాధానం చెప్పాలి.

గోపాల్ రెడ్డి, తుమ్మలకుంట గ్రామం.

ఇది మరో పెద్ద కుట్ర



చిలమత్తూరు మండలంలో వివిధ సమస్యలతో అపరిష్కృతంగా ఉన్న రైతులను భూములను లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములుగా మార్చడం వెనుక పెద్ద కుట్ర ఉంది. హబ్ పేరుతో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన బోగస్ కంపెనీ ఇప్పుడు మరోమారు తన పేరిట సుమారు 1075 ఎకరాలను మార్చేసుకుంది. ఇందులో అధికారులు, పెద్దల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. రైతులు ఏమీ చేయలేరనే ఇలాంటి దారుణానికి ఒడిగట్టారు. ఇందులో వైసిపి ప్రభుత్వ పెద్దల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రీ సర్వేలో ఉన్న వెసులుబాటును ఉపయోగించుకుని ఆ సంస్థతో అధికారులు కుమ్మక్కై రైతుల భూములను కాజేయాలని కుట్ర చేస్తున్నారు. దీనిని వ్యవసాయ కార్మిక సంఘంగా తాము తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆన్‌లైన్‌లో లేపాక్షి హబ్ పేరును తొలగించి రైతుల పేరిట భూములు మార్చకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతాం.

ఫిరంగి ప్రవీణ్ కుమార్, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు.

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేద్దాం

మంత్రి ఉషశ్రీ చరణ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం


ఈ నెల 8వ తేదీన కళ్యాణదుర్గంకి రానున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభలో నియోజకవర్గంలోని ప్రతి వైసిపి నాయకుడు, కార్యకర్త, ప్రజలు పాల్గొని విజయవంతం చేద్దామని మంత్రి ఉషాశ్రీచరణ్ తెలిపారు. ఆదివారం నాడు కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండలాల వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 8న వైఎస్ఆర్ రైతు దినోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్మోన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేస్తారన్నారు. నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కృషి చేయాలని సూచించారు.

సమర్థవంతంగా పనిచేద్దాం : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

అనంతపురం కలెక్టరేట్ : ఈనెల 8వ తేదీ రైతు దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కళ్యాణదుర్గంలో పర్యటించనున్నారని, దీనికోసం అన్ని శాఖలూ సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎమ్.గౌతమి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఆదివారం నాడు కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆ శాఖల పరిధిలో అధికారులకు అప్పగించిన విధులను సమిష్టిగా, సమర్థవంతంగా పనిచేయాలన్నారు. బహిరంగ సభ వద్ద గ్యాలరీల్లో సీటింగ్ ఏర్పాట్లు, శానిటేషన్ సక్రమంగా ఉండాలన్నారు. తాగునీరు అందరికీ అందేలా చూడాలన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. హెలిప్యాడ్, అక్కడి నుంచి బహిరంగ సభ వరకు బ్యారికేట్స్ ఏర్పాట్లపై ఆర్అండ్‌బి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసులు వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు, బందోబస్తుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ నిశాంత్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మృతి చెందిన తల్లీఇద్దరు కూతుళ్లు (ఫైల్ ఫొటో)

క్షణికావేశం..!

ఇద్దరు కూతుళ్లతో సహా చెరువులో దూకి తల్లి ఆత్మహత్య

ఓ వివాహిత క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. కుటుంబంలో రేగిన మనస్పర్ధలను పరిష్కరించుకోలేక చావే శరణ్యం అనుకుంది. తాను చనిపోతే తన ఇద్దరు కూతుళ్లను ఎవరూ పట్టించుకోరని భావించి వారినీ తన వెంట తీసుకెళ్లింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఇద్దరు కూతళ్లను చెరువులో తేసేసి తాను దూకి ఆత్మహత్య చేసుకుంది. శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో తల్లి సుగుణ(40), తన కూతుళ్లు దేవయాని(7), చెస్మిత(5)లు మృతిచెందారు.

వార్త మెయిన్‌లో



మృతి చెందిన భార్యాభర్తలు

విషాదం

◆ ట్రాక్టర్ బోల్తా ◆ భార్యాభర్తలు మృతి

ప్రజాశక్తి-బెలుగుప్ప

వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న భార్యాభర్తలను ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. వీరి ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో దంతులిద్దరూ ఘటనా స్థలంలోనే మరణించారు. బెలుగుప్ప మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... నక్కలపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి(45), సువర్ణమ్మ(40) భార్యాభర్తలు. వీరిద్దరూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆదివారం ఉదయం వారి తోటలో వ్యవసాయ పనులు ముగించుకుని ట్రాక్టర్లో ఇంటికి బయల్దేరారు. ఈశ్వర్‌రెడ్డి ట్రాక్టర్ తోలుతుండగా భార్య ఆయన పక్కన కూర్చొంది. గ్రామ సమీపంలోని వంక వద్ద ఉన్న పెద్ద గుంతలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజిన్ కింద భార్యాభర్తలు ఇద్దరూ పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అటుగా వెళు తున్న తోటి రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామకష్ణయ్య అక్కడికి చేరుకున్నారు. మతదేహాలను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైతు దంపతుల మృతి విషయం తెలుసుకున్న ఉరవకొండ నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం తరుపున కుటుంబానికి అండగా ఉంటామని మృతుల కుమారుడు, కుమార్తెకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల వైసిపి నాయకులు నక్కలపల్లి సర్పంచి రామిరెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, నక్కలపల్లి భాస్కర్ రెడ్డి, కరుణాకర్ ఉన్నారు.

అంబటి ఆంజనేయులు ఆశయాలు సాధిద్దాం

సంతాప సభలో వక్తలు



అంబటికి నివాళులర్పిస్తున్న నాయకులు, జర్నలిస్టులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సుమారు 40 ఏళ్లకుపైగా జర్నలిస్టు సంక్షేమం కోసం కృషి చేసిన సీనియర్ జర్నలిస్టు అంబటి ఆంజనేయులు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో కన్వీనర్ పయ్యావుల ప్రవీణ్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అంబటి ఆంజనేయులు సంతాప సభ నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, వైసిపి నాయకులు ఈశ్వరయ్య మాట్లాడుతూ అంబటి ఆంజనేయులు జర్నలిస్టుల సంక్షేమం కోసం చేసిన సేవలను ఆదర్శనీయంగా నిలిచాయని కొనియాడారు. ఉద్యమకారుడిగా పేరుగాంచిన వ్యక్తి మన మధ్యలో లేకపోవడం బాధాకరంగా ఉందన్నారు. ఏ వృత్తిలోనైనా పని చేస్తున్న వారు సమస్యల పట్ల కొంతకాలం వరకు నాయకులుగా పనిచేస్తారని తెలిపారు. అంబటి ఆంజనేయులు తమ వ్యక్తిగత జీవితాలను పక్కన పెట్టి జర్నలిస్టుల సమస్యల కోసం 40 ఏళ్లుగా చివరి క్షణం వరకు ఉద్యమిస్తూ జర్నలిస్టులకు సంక్షేమ ఫలాలను అందించిన వ్యక్తి అన్నారు. ఆయన ఆశయాలను మనం కొనసాగించడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరాం, కో కన్వీనర్ ఆయూబ్‌బాషా, కమిటీ సభ్యులు చలపతి, కెపి.కుమార్, చౌడప్ప, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్, సీనియర్ జర్నలిస్టులు మార్కండేయులు, ఆనందవర్ధన్, బికారి, రామ్మూర్తి, మల్లికార్జున, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టవర్‌క్లాక్ వద్దే తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ తహశీల్దార్ కార్యాలయాన్ని టవర్‌క్లాక్ వద్ద ఉన్న స్థలంలోనే ఏర్పాటు చేయాలని సిపిఎం అనంతపురం రూరల్ మండల కమిటీ కార్యదర్శి టి.రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ గ్రామాల్లో ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న తహశీల్దార్ కార్యాలయానికి రావాలంటేనే ప్రజలకు రవాణా ఛార్జీలు భరించలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. రూరల్ తహశీల్దార్ కార్యాలయం కూడా రూరల్ కాలనీల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. అలా ఏర్పాటు చేస్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కావున టవర్‌క్లాక్ సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వం స్థలంలోనే తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. సంతకాల సేకరించి కలెక్టర్ ఎమ్.గౌతమి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ మండల కమిటీ సభ్యులు పుష్పరాజు, తిరుపాలు, చెన్నారెడ్డి, మోహన్‌రెడ్డి, తాటిచెర్ల, సోమలదొడ్డి, కందుకూరు, మన్నీల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



ప్రజల నుంచి సంతకాల సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి www.prajasakti.com



భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఎన్‌హెచ్ 544-డి నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

అనంతపురం నుంచి గుంటూరు వరకూ నిర్మిస్తున్న జాతీయ రహదారి 544-డి నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారికి చెందిన భూముల నిర్వాసితులకు అధికారులు ఇష్టమొచ్చినట్లు పరిహారం ఇస్తున్నారన్నారు. ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన రమణమ్మకు తన రెండున్నర సెంటు ఇంటికి కేవలం రూ.7,500 మాత్రమే పరిహారం ఇవ్వాలని నిర్ధారించడం బాధాకరమన్నారు. ఆయా మండలాల తహశీల్దార్లు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి, ఎర్రగుంటపల్లి గ్రామస్తులు గంగాధర్, గాంధీ, కమలమ్మ, రాజేశ్వరి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరజమ్మ

ప్రజాశక్తి-శింగనమల

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని తరిమెల గ్రామంలో కంచిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు ఓటమితో కుంగిపోకుండా గెలుపు కోసం కసితో పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే గెలుపుతో పొంగిపోకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ముందుకు సాగాలన్నారు. అనంతరం విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. విజేత బుక్కరాయసముద్రం క్రికెట్ జట్టుకు మొదటి బహుమతి రూ.25,016, 2వ బహుమతి వెంకటాపురం జట్టుకు రూ.15,016, 3వ బహుమతి రోటరీపురం జట్టుకు రూ.10,016 అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్‌యాదవ్, డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధా భాస్కర్‌రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు చెన్నకేశవుల యాదవ్, వైసిపి మండల కన్వీనర్ పట్నం నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతి చెక్కు అందజేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి,

రక్తదానానికి ముందుకురావాలి

అర్బన్ బ్యాంకు ఛైర్మన్ మురళీధర్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జె.ఎల్.మురళీధర్ పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం అర్బన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం అర్బన్ బ్యాంక్ వ్యాపార లావాదేవీ కాకుండా సమాజ సేవలో కూడా ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అనంత ప్రజలకు సహాయపడాలనే ఉద్దేశంతోనే మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి155 మంది సభ్యులు రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం చేసి వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా అర్బన్ బ్యాంక్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ అందరినీ కలుపుకుని బ్యాంకు అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్లు కృష్ణకుమార్, రమణయ్య, డైరెక్టర్లు రామాంజినేయులు, గోల్డ్ బాషా, రోళ్ల భాస్కర్, మణి, చింతా భాస్కర్, సుంకర రమేష్, వెంకటాద్రి, రిటైర్డ్ డిసిఒ పుల్లప్ప, ఖాతాదారులు, అనంత ప్రజలు, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న అర్బన్ బ్యాంక్ మహిళ ఉద్యోగులు

ఒటిపిఆర్ఐ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు అనుబంధ ఒటిపిఆర్ఐ విద్యార్థులు జీ.ఫ్యాట్-23 పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 22న జీ.ఫ్యాట్ పరీక్ష ఫలితాల్లో జి.లింగేశ్వర్ 378వ ర్యాంకు, కె.ప్రతూషా 921, జి.శివరంజన 2286, జ్యోశిత 2619, బి.రాజశేఖర్2964, జి.సుకన్య 2586, ఎస్.బ్లేసీ 8472, ఎం.శిరీషా 8,870 ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కుందుర్పి : ఇటీవల క్షయ వ్యాధితో మరణించిన ఉమేష్ కుటుంబ సభ్యులకు కుందుర్పి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ క్షయవ్యాధితో మరణించిన ఉమేష్ కుటుంబ పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని మూడు నెలలకు సరిపడు సరుకులు, దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే స్థానిక వాలంటీర్ రేష్మా తమవంతు సాయంగా రూ.2వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి ఎటిఎల్ వై.నారాయణస్వామి, దుర్గం ఛారిటబుల్ ట్రస్టు ఫౌండర్ లయన్ కంబాల తిమ్మారెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకుడు ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాలో అర్హులకు అన్యాయం

ఈక్రాప్ బుకింగ్‌లో సిబ్బంది చేతివాటం - నష్టపోయిన రైతులకు మళ్లీ నిరాశే..

ప్రజాశక్తి-పుట్లూరు



పంట దెబ్బతిన్న తోటలో రైతు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పంటల బీమాలో అర్హులైన రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో పనిచేస్తున్న విఎఎలు, విహెచ్‌ఎలు ఈక్రాప్ బుకింగ్‌లో అవినీతికి పాల్పడటం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా రైతులు ఏ పంటను సాగు చేసిన తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలి. ఇది ప్రభుత్వ నిబంధన అయితే చాలామంది రైతులకు ఈక్రాప్ బుకింగ్‌పై అవగాహన ఉండటం లేదు. దీంతో ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో పని చేసున్న విఎఎలు, విహెచ్‌ఎలు పొలాల్లోకి వెళ్లి రైతుల వివరాలు సేకరించి ఈక్రాప్ బుకింగ్ చేయాలి. అలాకాకుండా ఎవరు డబ్బులు ఇస్తే వారి పంటలు ఈక్రాప్ బుకింగ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో డబ్బులు ఇచ్చిన వారు పంటలు సాగు చేయకపోయినా పర్సెంటేజీలు మాట్లాడుకుని ఈక్రాప్ బుకింగ్ చేసినట్లు సమచారం. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారంలో పర్సెంటేజీ ప్రకారం రైతుల నుంచి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా 5,328 ఎకరాల్లో రైతులు చీనీ పంటను సాగు చేశారు. అయితే 5225 ఎకరాలకు మాత్రమే బీమా మంజూరైంది. ఇందులో కూడా దాదాపు 100 ఎకరాలకు పైగానే పంట సాగు చేయని వారికి బీమా మంజూరైంది. నిజమైన అర్హులకు అన్యాయం జరిగింది. ఒక పుట్లూరు సచివాలయ పరిధిలో 30 ఎకరాలు, కందికాపుల సచివాలయ పరిధిలో పదెకరాలు, మడ్డిపల్లి, కుమ్మనమల తదితర సచివాలయాల పరిధిలో పలువురు చీనీ పంట సాగు చేశారు. వీరిలో చాలామందికి పంటల బీమాలో నిరాశ ఎదురైంది. పుట్లూరుకు చెందిన రవిశంకర్‌రెడ్డి కందికాపుల గ్రామంలో సర్వే నెంబర్ 229-సి వన్, 233సి వన్ పొలంలో చీనీ పంట సాగు చేశాడు. అయితే ఇతనికి బీమా మంజూరు కాలేదు. ఇతనితోపాటు పక్కనే సాగు చేసిన రైతులకు కూడా అదే పరిస్థితి. అయితే అదే గ్రామంలో చెట్లు లేని వారికి బీమా మంజూరు కావడం విశేషం.

గతేడాది ఇలాగే జరిగితే మండలంలోని కందికాపుల, తక్కల్లపల్లి గ్రామాల రైతులు ఏకమై సచివాలయాన్ని నిర్బంధించిన విషయం తెలిసిందే. అప్పట్లో అవినీతికి పాల్పడిన కందికాపుల విఎఎలను సస్పెండ్ చేశారు. అయితే అప్పట్లోనే ఆ సచివాలయంతోపాటు మరికొన్ని సచివాలయాల్లో కూడా అవే తప్పులు చేశారని రైతులు ఆధారాలతో సహ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.

పంటల బీమాలో జరిగిన అన్యాయంపై ఆయా సచివాలయాలకు వెళ్లి సిబ్బందిని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఫోన్‌లో హెచ్ఒ ఫసుబేగంను వివరణ కోరగా స్పందన లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన రైతులను గుర్తించి పంటల బీమా అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

టిడిపి ఎన్నియాత్రలు చేసినా ఫలితం శూన్యం

జగన్‌పై ప్రజల్లో విశ్వాసం తగ్గదు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ని యాత్రలు చేసినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో విశ్వాసం తగ్గదని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని 2వ డివిజన్‌లో 1.91 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక అనంతపురం నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకెళ్తున్నామన్నారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి టిడిపి నాయకులు నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి నగరంలో ఎక్కడ చేసినా రోడ్లన్నీ గుంతలమయమై.. కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో తాము ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నాలుగేళ్లలో అభివృద్ధి చేసి చూపించామన్నారు. రూ.650 కోట్లతో పనులు చేపట్టి అనంతపురం రూపురేఖలు మార్చివేశామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ప్రతి సచివాలయానికీ మంజూరైన రూ.20 లక్షల చొప్పున అనంతపురం నగరానికి రూ.15 కోట్లు వచ్చాయన్నారు. వీటితోపాటు జనరల్ ఫండ్స్, ఆర్థిక సంఘం నిధులు, ఎంపీ నిధులు, స్పెషల్ గ్రాంట్స్‌తో పనులు చేస్తున్నామన్నారు. 2వ డివిజన్‌లో ఏకంగా రూ.4 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఎన్టీఆర్ మార్గ్‌కు గత పాలకులు పేరు పెట్టుకోవడం తప్పితే చేసిందేమీ లేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాకే పనులు పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. కాగా అధికారంలో ఉండి ఏమీ చేయలేని పాలకులు.. ఇప్పుడు తాము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వాటిని తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో నాయకులు మాటలకే పరిమితం అయ్యారని విమర్శించారు.

టిడ్కో ఇళ్ల విషయంలోనూ అపద్ధాలు

నగరంలో టిడ్కో ఇళ్ల విషయంలోనూ అపద్ధాలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఎన్నికల ముందు లబ్ధిదారులతో డబ్బులు వసూలు చేసి నిర్మాణాలు పూర్తి చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చే సమయానికి కనీసం ఫ్లింత్ దశలో కూడా ఇళ్లు లేవని చెప్పారు. కానీ టీడీపీ హయాంలోనే 90 శాతం పూర్తి చేసినట్లు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 2304 మందికి టిడ్కో ఇళ్లను త్వరలోనే అందిస్తామని స్పష్టం చేశారు. టిడ్కో ఇళ్ల కోసం డీడీలు కట్టిన వారికి కూడా డబ్బులు తిరిగి ఇస్తామని తెలిపారు. ఇప్పటికే వారికి వేరే చోట ఇంటి స్థలాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహహ్మద్ వసీం, కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు లీలావతి, సుమతి, లక్ష్మీదేవి, దేవి, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, బాబా, జేసీఎస్ కన్వీనర్ బోయ లక్ష్మన్న, డివిజన్ కన్వీనర్ రవి, వైసిపి నాయకులు గంగాధర్, రాజా, రామకృష్ణ, నాగేంద్ర, అల్తాఫ్, ఆది, సుధాకర్, కృష్ణ, హరి, అమర్ పాల్గొన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నాయకులు

శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం స్థానిక శిల్పారామంలో రంగస్థలం కళాకారులు నిర్వహించిన సంగీత విభావరి అందరినీ అలరించింది. అనంతపురానికి చెందిన కిరణ్ మ్యూజిక్ అకాడమీ భారతి బృందం వాయిద్య సమ్మేళన సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ రంగస్థల కలాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నరశింహయాదవ్, కళాకారులు లాస్య, లహరి, స్నేహ, ప్రదీతి, మౌనిక విష్ణుప్రీతమ్, దేవకీనందన్, శిల్పారామం పరిపాలనా అధికారి కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



అలరిస్తున్న కళాకారులు

పేదల అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్షాలు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలను అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాల నాయకులు లేనిపోని దుష్ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రతి పథకం అర్హులకు అందేస్తున్నామన్నారు. తాము మంచి పథకాలు, మంచి కార్యక్రమాలు చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం తమ ఎల్లో మీడియాతో పచ్చి అబద్ధాలతో వార్తలు రాయించడంతోపాటు లేనిపోని ఆరోపణలు చేఉస్తున్నాయని మండిపడ్డారు. ఈ దుష్ట చతుష్టయం ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 కి 175 గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శివానందగౌడ్, ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బసన్న, ఎస్సీ విభాగం నాయకులు సుంకన్న, ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ ఈరమ్మ, సర్పంచి బ్యాలా రాణీ రాజశేఖర్, ఎంపిటిసిలు లక్ష్మీ,నాయకులు డిష్ వెంకటేష్, షన్ముఖ్ గౌడ్, వెంకటేష్, నల్ల సుంకన్న, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

టిడిపితోనే ప్రజలకు సమన్యాయం

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-గార్లదిన్నె

తెలుగుదేశం ప్రభుత్వంతోనే ప్రజలకు సమన్యాయం సాధ్యమని మాజీమంత్రి, టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఇల్లూరు, కల్లూరు గ్రామాల్లో టిడిపి చేపట్టిన భవిష్యత్తుకు భరోసా బస్సుయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన గ్రామాల్లో కనీసం సిమెంటు రోడ్డు కూడా వేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిరుద్యోగుల్ని మోసం చేసిందన్నారు. సత్యసాయి జిల్లా అధ్యక్షులు పార్థసారథి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. అదేవిధంగా నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామన్నారు. మాజీమంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ్‌రెడ్డి, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, ఇల్లూరు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



బస్సుయాత్రలో పాల్గొన్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

విద్యార్థికి విషపురుగు కాటు

గుత్తి : మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న సేవాఘడ్ గిరిజన గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి ఆదివారం విష పురుగు కాటుకు గురయ్యాడు. ఇంటర్ చదువుతున్న సాయి సేవానాయక్ పాఠశాలలోని వసతి గృహంలో ఉండగా విషపురుగు కాటేసింది. ఆవెంటనే విద్యార్థిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు.

వృద్ధురాలిపై వ్యక్తి దాడి

గుత్తి : మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో ఆదివారం సుంకమ్మ అనే వృద్ధురాలుపై ఓ వ్యక్తి దాడి చేశాడు. గ్రామానికి చెందిన కన్నప్ప, సుంకమ్మ పొలాలు పక్కన పక్కనే ఉన్నాయి. చేను గట్టు విషయమై ఆగ్రహానికి గురైన కన్నప్ప సుంకమ్మ పై కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ తరలించారు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన రామాంజనేయులు పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో గుత్తికి వచ్చాడు. కెపిఎస్ థియేటర్ ఎదురుగా 44 జాతీయ రహదారిపై ముందర వెళుతున్న ఆటోను ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ముస్లిం యువకులపై దాడి



గాయపడిన ముస్లిం యువకుడు

బొమ్మనహాల్ : మండలంలోని గోనేహాల్ గ్రామానికి చెందిన ముస్లిముల శ్మశాన వాటికలో కొందరు ముస్లిం యువకులపై దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే... గోనేహాల్‌కు చెందిన హోలీ బాషా స్థానిక శ్మశాన వాటికలో తన తల్లి చనిపోయి 40 రోజుల కార్యక్రమం చేస్తుండగా గ్రామానికి చెందిన బండూరు రామాంజితోపాటు అనుచరులు ముస్లిం యువకులపై రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. ముస్లిం యువకులు చదివింపులు చేసుకుని వస్తుండగా శ్మశాన వాటిక తమ పొలంలో ఉంటూ బండు రామాంజి, అతని కుమారులు ఇద్దరు, బంధువులు నలుగురు మద్యం తాగి గొడవకు దిగారు. ఇందులో భాగంగా ఒకరికొకరు కలపడటంతో పలువురు గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఆసుపత్రికి తరలించారు. బాధితు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదారు హనుమత్‌నాయక్ తెలిపారు.

బోరుతవ్వకానికి భూమిపూజ



రిగ్ బోరుకు భూమిపూజ చేస్తున్న విప్ కాపు

రాయదుర్గం : పట్టణంలోని సున్నంబట్టి మలకల్మూర్ రోడ్డు పక్కన రిగ్ బోర్ తవ్వకానికి విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ ప్రాంతంలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉండటంతో స్థానికు విజ్ఞప్తి మేరకు మున్సిపల్ సాధారణ నిధులతో రిగ్ బోర్ తవ్వకానికి శ్రీకారం చుట్టినట్లు 22వ వార్డు సభ్యులు పెద్ద వన్నూరప్ప తెలిపారు. బోర్ తవ్వకంతో పాటు రెండు నీటి ట్యాంకులు మోటార్లను ఏర్పాటు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, గుమ్మగట్ట జడ్పిటిసి మహేష్, ఎస్ఐ సునీత, వార్డు సభ్యులు డిష్ గోవింద, మంజునాథ, ఫక్రుద్దీన్, వైసిపి పట్టణ కన్వీనర్ ముస్తాక్, నాయకులు ఇస్మాయిల్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం ఎన్నిక

గుత్తి : జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వై.ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుత్తి శాఖా గ్రంథాలయాధికారి హెచ్. రామాంజనేయులు, గౌరవాధ్యక్షులుగా హెచ్.శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.రవికుమార్ నాయుడు, రాష్ట్ర ఈసీ సభ్యుడిగా పి.కమ్మన్న, కోశాధికారిగా డి.గోవిందు, సంయుక్త కోశాధికారిగా ఎస్.వెంకటేష్, ఉపాధ్యక్షులుగా శ్రీపతి, విజయభాస్కర్, శీనానాయక్, రామాంజనమ్మ తోపాటు మరో 18 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమామోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

వైఎస్ఆర్ బీమా సొమ్ము పంపిణీ

గుత్తి : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో వ్యక్తికి ఆదివారం వైఎస్ఆర్ బీమా పథకం కింద మంజూరైన ఆర్థికసాయం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సిద్ధిబాషా అనారోగ్యంతో మృతి చెందడంతో తక్షణ సాయం రూ.10 వేలను మృతుడి భార్య సలీమాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు మెట్టు లక్ష్మీకాంతరెడ్డి, ఖాసీం పీరా తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తం సేవలు మరువలేనివి

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జయం పురుషోత్తం చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి కొనియాడారు. ఆదివారం స్థానిక సాయిసుబ్రమణ్యేశ్వర కళ్యాణ మండపంలో పురుషోత్తం సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో చింతపండు వ్యాపారిగా ఉంటూ అందరినీ ఆప్యాయంగా పలకరించే వ్యక్తి పురుషోత్తం అన్నారు. ఆయన మృతి తీరని లోటన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, పారిశ్రామికవేత్త జీకే.కృష్ణమూర్తి, ఆర్జీ శివశంకర్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జయం ఫణీ, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, గుప్తా, జయం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు

రాయదుర్గం : రాయదుర్గంలో పెన్షనర్లకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కృషి చేస్తామని స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ మృత్యుంజయ తెలిపారు. ఆదివారం లక్ష్మీబజార్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో పెన్షనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోవు నెలలో నిర్వహించనున్న పెన్షనర్ల సమావేశానికి తనతో పాటు సాంకేతిక సిబ్బందిని కూడా సమావేశానికి తీసుకొస్తానన్నారు. పెన్షనర్లందరూ ఆ సమావేశానికి తమ స్మార్ట్ ఫోన్, ఆధార్ కార్డును వెంట తీసుకురావాలన్నారు. పెన్షనర్ల ఫోన్లో 'యోనో యాప్'ను డౌన్లోడ్ చేయించి దాని ద్వారా పెన్షనర్ల బ్యాంకు ఖాతా లావాదేవీలు జరుపుకునేందుకు, స్థితిగతులు తెలుసుకునేందుకు వీలవుతుందన్నారు. ఈ సమావేశంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

అనంతపురం కలెక్టరేట్ : బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ బుక్కరాయసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం మండల అధ్యక్షులు కె.విశ్వనాథ్ అధ్యక్షతన దాదాపుగా 52 మందికి వీడ్కోలు సన్మానం, 20 మందికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎన్.రఘురామిరెడ్డి, గౌరవాధ్యక్షులు డి.ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ కె.సర్దార్ వలి, ప్రధాన కార్యదర్శి వన్నప్ప, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, సీనియర్ నాయకులు అనంతయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, జిల్లా నాయకులు నరేష్, నార్పల మండల ప్రధాన కార్యదర్శి హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.